ట్యూనా చేప @ 11 కోట్లు

టోక్యో, జనవరి 5: ఒక చేప ధర అక్షరాల రూ.11 కోట్లు. అలాగని ఆ చేప కడుపులో విలువైన వజ్రాలో, డ్రగ్సో లేవు. అదొక బ్లూఫిన్ ట్యూనా చేప. ఒక మోటారు బైక్ సైజులో 276 కిలోల బరువున్న ట్యూనా చేపకు జపాన్‌లోని టోక్యో చేపల మార్కెట్‌లో పలికిన ధర 1.3 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.11 కోట్లు పైనే). ఒనడ్రా గ్రూప్‌నకు చెందిన సుషీ రెస్టారెంట్ యజమానులు దానిని భారీ ధరకు కొనుగోలు చేశారు. గత ఏడాది వీరే 114 మిలియన్ యెన్‌లు (సుమారు రూ.6 కోట్లు) వెచ్చించి ఒక ట్యూనా చేపను కొన్నారు. 1999 తర్వాత ఈ ఫిష్ మార్కెట్‌లో అత్యధిక ధర పలికిన రెండో చేపగా ఇది రికార్డుకెక్కింది. ఆ ఏడాది 278 కిలోల బ్లూఫిన్ ట్యూనా చేప సుమారు రూ.18 కోట్లకు అమ్ముడుపోయింది.

న్యూయార్క్‌లో రద్దీ చార్జీలు

న్యూయార్క్: ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు అమెరికాలో తొలిసారి న్యూయార్క్‌లో రద్దీ చార్జీల పథకాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా ఆ నగరంలో ఎంతో రద్దీగా ఉండే ప్రఖ్యాత ఎంపైర్ స్టేట్ బిల్డింగ్, టైమ్స్ స్క్వేర్, వాల్ స్ట్రీట్ లాంటి ప్రాంతాల్లో ప్రవేశించే వాహన చోదకులు పీక్ అవర్స్‌లో రోజుకు 9 డాలర్లు (దాదాపు రూ.772) వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద ట్రక్కులు, టూరిస్టు బస్సులాంటి ఇతర వాహనదారుల నుంచి ఆఫ్-పీక్ అవర్స్‌లో 2.25 డాలర్ల నుంచి 21.60 డాలర్ల (రూ.193 నుంచి రూ.1,853) వరకు చార్జీలు వసూలు చేస్తారు. డొనాల్డ్ ట్రంప్ సహా ఎంతో మంది ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నెలలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే ఆ పథకాన్ని రద్దు చేస్తానని ట్రంప్ ప్రకటించారు. ఎన్నో రాజకీయ వివాదాలు, న్యాయపరమైన అడ్డంకుల తర్వాత కార్యరూపం దాల్చిన ఈ పథకాన్ని రెండేండ్ల క్రితం న్యూయార్క్ గవర్నర్ కాథే హోచుల్ ప్రతిపాదించారు. ట్యాక్సీ డ్రైవర్ల సంఘాలు, వ్యాపారులు, పాదచారులు సహా అనేక వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఈ పథకానికి పలు సవరణలు చేయాల్సి వచ్చింది. దీంతో న్యూయార్క్ ప్రభుత్వం పొరుగునే ఉన్న న్యూజెర్సీ కోర్టును ఆశ్రయించింది. కానీ, ఆ ప్రయత్నం విఫలమవడంతో రద్దీ చార్జీల పథకం అమలుకు మార్గం సుగమమైంది.



స్పామ్ కాల్స్‌కు చెక్!

న్యూఢిల్లీ : ఫోన్ వినియోగదారులను ఇబ్బంది పెడుతున్న స్పామ్ కాల్స్‌కు కళ్లెం వేసేందుకు ట్రాయ్ సిద్ధమవుతున్నది. వాణిజ్య సమాచారం, ప్రకటనలను కస్టమర్లు స్వీకరించేందుకు ఇచ్చే అనుమతులను ట్రాయ్ డిజిటల్ డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ ప్లాట్‌ఫాంకు బదలీ చేసేందుకు ఓ పైలట్ ప్రోగ్రామ్‌ను త్వరలో ప్రారంభించబోతున్నట్టు ట్రాయ్ చైర్మన్ లహోటీ తెలిపారు. క్రమబద్ధీకరణ ప్రక్రియను గాడిలో పెట్టడం కోసం ఉద్దేశించిన ఈ చర్యలు కస్టమర్లు ప్రస్తుతం ఇచ్చిన అనుమతులను తనిఖీ చేయడానికి వీలు కల్పిస్తాయి. ఆ అనుమతులను ఉపసంహరించుకునే అవకాశం వినియోగదారులకు కల్పిస్తాయి. వాయిస్ కాల్స్‌కు, ఎస్ఎంఎస్‌కు వేర్వేరుగా స్పెషల్ టారిఫ్ వోచర్స్ (ఎస్‌టీవీ)లను ఆఫర్ చేయాలని ఇటీవల ట్రాయ్ నిబంధన తీసుకొచ్చింది.

ప్రియాంక గాంధీ బుగ్గల్లా రోడ్లు

తండ్రిని మార్చేసిన ఆతిశీ.. బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రమేశ్ బిధూరి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జరిగిన ఒక సభలో ఆయన మాట్లాడుతూ తాను గెలిస్తే నియోజకవర్గంలోని రోడ్లను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ చెంపలంతా నునుపుగా మారుస్తానని అన్నారు. దీనిపై కాంగ్రెస్ స్పందిస్తూ సహచర ఎంపీని దూషించి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంతకు మించిన ప్రవర్తన ఏం ఆశిస్తామని ప్రశ్నించింది. విమర్శలు పెరగడంతో బిధూరీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీపైనా బిధూరీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆతిశీ తన తండ్రి పేరునే మార్చేశారని ఆరోపించారు. ఒకప్పుడు మర్లేనాగా ఉన్న ఆతిశీ ఇప్పుడు సింగ్ అయ్యారని, ఆమె తన తండ్రినే మార్చేశారని అన్నారు. బిధూరీవ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. బీజేపీ నాయకులు సిగ్గు లేకుండా అన్ని హద్దులు దాటేశారని ఆయన విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీని బీజేపీ నాయకులు దుర్భాషలాడుతున్నారని, ఒక మహిళా ముఖ్యమంత్రిని అవమానించడాన్ని ఢిల్లీ ప్రజలు సహించరని హెచ్చరించారు.

ఇక దేశీయ పారాసిటమాల్

న్యూఢిల్లీ: నొప్పి నివారిణి, జ్వరం తగ్గించే మాత్రగా విరివిగా వాడే 'పారాసిటమాల్'ను దేశీయంగా తయారుచేయబోతున్నట్టు కేంద్రం వెల్లడించింది. శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) ద్వారా దేశీయంగా అభివృద్ధి చేసిన 'పారాసిటమాల్'ను తీసుకురాబోతున్నట్టు తెలిపింది. తద్వారా పారసిటమాల్ తయారీకి సంబంధించిన ముడి పదార్థాల దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని తగ్గిస్తున్నట్టు ఆదివారం కేంద్రం తెలిపింది. పారాసిటమాల్ తయారీకి సంబంధించి దేశీయ టెక్నాలజీని సీఎస్ఐఆర్ అభివృద్ధి చేసిందని కేంద్ర మంత్రి జితేంద్ర చెప్పారు.

60 శాతానికి చేరుకున్న కాంగ్రెస్ సర్కార్ కమీషన్లు

కేంద్ర మంత్రి కుమారస్వామి

మైసూరు: కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వంలో కమీషన్లు 60 శాతానికి పెరిగాయని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి, జేడీఎస్ నాయకుడు హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. ఆదివారం మైసూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు సైతం దీన్ని ఒప్పుకున్నారని, పేదలకు చెందిన ఇళ్ల కేటాయింపులో కూడా అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. గతంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీఓలు) లంచాలు వసూలు చేసేవారని, కాని ఇప్పుడు సచివాలయంలో మంత్రులే నేరుగా ముడుపులు తీసుకుంటున్నారని కుమారస్వామి ఆరోపించారు. దీన్నేనా సత్యమేవ జయతే అంటారు అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ సొమ్మును లూటీ చేయడంలో మీ ఆశకు అంతులేదా అని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

అదానీ ప్రాజెక్టుల సమీక్షకు కమిటీ!

శ్రీలంక ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 5: తమ దేశంలోని అదానీ గ్రూప్ ప్రాజెక్టుల సమీక్ష, అధ్యయనానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని శ్రీలంక విద్యుత్తు శాఖ నిర్ణయించింది. ఈ కమిటీ ఏర్పాటు ప్రతిపాదనను రానున్న క్యాబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నట్టు న్యూస్‌ఫస్ట్ తెలిపింది. తమ దేశంలో అదానీ గ్రూప్ నెలకొల్పాలనుకున్న పవన విద్యుత్తు ప్రాజెక్ట్‌లపై అధ్యయనానికి ఇటీవల శ్రీలంక ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. శ్రీలంకలో 484 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అంచనాతో పవన విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటుకు అదానీ గ్రూప్ గతంలో ప్రణాళికలు రూపొందించింది. భారత్‌లో పలు ప్రాజెక్ట్‌లు పొందడానికి అదానీ గ్రూప్ కొందరు అధికారులు, రాజకీయ నాయకులకు లంచాలిచ్చిందని అమెరికాలో ఆరోపణలు వచ్చాయి.

పెండ్లి కాని జంటలకు నో రూమ్

కొత్త పాలసీ ప్రకటించిన ఓయో

న్యూఢిల్లీ, జనవరి 5: ఇంతకాలం ఏకాంతంగా గడపడానికి ఓయో రూమ్‌లను వినియోగించుకున్న పెండ్లికాని యువతీ యువకులు, జంటలకు బ్యాడ్ న్యూస్. ఓయో రూమ్‌లు ఇక నుంచి వారికి అందుబాటులో ఉండవు. ఇక నుంచి పెండ్లి కాని జంటలకు రూమ్‌లను అద్దెకు ఇవ్వమని ప్రముఖ హోటల్ అగ్రిగేటర్ ఓయో ప్రకటించింది. ఈ మేరకు కొత్త చెక్-ఇన్ పాలసీ గురించి వివరిస్తూ తమ భాగస్వామ్య హోటళ్లకు ఈ ఏడాది నుంచి ఈ నిబంధనను అమలు చేస్తామని తెలిపింది. తొలుత దీనిని మీరట్‌లో తక్షణం ప్రారంభిస్తున్నామని పేర్కొన్నది. ఈ కొత్త పాలసీ ప్రకారం జంటలు ఇకపై ప్రత్యక్షంగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ ఓయో రూమ్‌లు బుక్ చేస్తే తమకు వివాహమైందన్న రుజువును తప్పనిసరిగా సమర్పించాలి. కాగా, పెండ్లి కానీ యువతీ యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు, ఇతర జంటలు ఏకాంతంగా కలుసుకునేందుకు ఇదివరకు ఓయో రూమ్‌లు సులభంగా లభించేవి. ఓయో యాప్‌లో బుక్‌చేసుకుని హోటల్‌కు వెళితే వారికి నేరుగా రూమ్ కేటాయిస్తారు. ఒక్క ధ్రువీకరణ పత్రం తప్ప, ఇతర వివరాలేవీ అడగరు. దీనిపై ఆరోపణలు రావడంతో ఓయో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది.

నలుగురు మావోయిస్టులు మృతి

హెడ్ కానిస్టేబుల్ కూడా..

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

కొత్తగూడెం క్రైం, జనవరి 5: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య ఆదివారం ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో నలుగురు మావోయిస్టులు, ఒక హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ - దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న అబూజ్‌మడ్ అడవుల్లో నాలుగు జిల్లాల భద్రతా దళాలు యాంటీ నక్సల్ ఆపరేషన్స్ నిర్వహించాయి. నారాయణ్‌పూర్ జిల్లాతోపాటు దంతేవాడ, కొండగావ్, జగ్దల్‌పూర్ జిల్లాల రిజర్వు గార్డు (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నర పాటు భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. మావోయిస్టుల కాల్పుల్లో డీఆర్‌జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ సన్ను కరమ్ మృతిచెందాడు.

ఐదో వంతు భారత కంపెనీలకే

హెచ్1బీ వీసాలపై అమెరికా వెల్లడి.. ఇన్ఫోసిస్, టీసీఎస్‌లకు ఎక్కువ వీసాలు

న్యూఢిల్లీ: అమెరికా జారీ చేసిన హెచ్1బీ వీసాలలో ఐదో వంతు భారత్‌కు చెందిన టెక్ కంపెనీలు దక్కించుకున్నాయి. అందులో ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్) లకు ఎక్కువ వీసాలు లభించాయని యూఎస్ ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రకటించిన వివరాల్లో వెల్లడించింది. 2024 సెప్టెంబర్ నాటికి 1.3 లక్షల హెచ్1బీ వీసాలు జారీ కాగా, అందులో 24,766 భారత్‌కు చెందిన వివిధ కంపెనీలకు లభించాయి. ఇందులో ఇన్ఫోసిస్‌కు 8,140, టీసీఎస్‌కు 5,274, హెచ్‌సీఎల్‌కు 2,953 వీసాలు దక్కాయి. మొత్తంపై అమెజాన్ కామ్ సర్వీసెస్ ఎల్ఎల్‌సీకి అత్యధికంగా 9,265 దక్కగా రెండో స్థానంలో ఇన్ఫోసిస్, 6,321తో కాగ్నిజెంట్ మూడో స్థానంలో నిలిచాయి. భారత్‌కు చెందిన విప్రోకు 1,634, టెక్ మహీంద్రాకు 1,199 వీసాలు మంజూరయ్యాయి. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీలు తమ సంస్థలలో విదేశీ నిపుణులను తాత్కాలికంగా నియమించుకోవడానికి ఈ హెచ్1బీ వీసాలను జారీ చేస్తారు. ఈ వీసాల ద్వారా భారత్, చైనాకు చెందిన టెక్ నిపుణులు ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారు.

హెచ్1బీ వీసాలకు కొత్త నిబంధనలు

వీసాల జారీలో 2025లో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. హెచ్1బీ వీసా కోసం వ్యవస్థాపకులు తమను తాము స్పాన్సర్ చేసుకునేందుకు ఈ నిబంధన అనుమతి ఇస్తుంది. యూఎస్‌లో టెక్ కంపెనీని స్థాపించే వ్యవస్థాపకులు వీసా కోసం అర్హత ప్రమాణాలు, స్వీయ జ్ఞానం కలిగి ఉంటే స్వీయ స్పాన్సర్ చేయవచ్చు. ఇప్పటివరకు స్పాన్సరింగ్ సంస్థలలో ఉద్యోగం చేస్తే తప్ప హెచ్1బీ వీసాలకు అర్హులుగా పరిగణించే వారు కాదు. స్వతంత్రంగా వ్యాపారాలను ప్రారంభించాలనుకునే వారికి ఉపాధి అనుమతి పొందడం కష్టంగా ఉండేది.

న్యూజిలాండ్ వీసా నిబంధనలు సరళతరం

న్యూజిలాండ్‌లో ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్న భారతీయులకు ఇది శుభ వార్త! ఉద్యోగులు, కార్మికుల కొరత వేధిస్తుండటంతో వీసా నిబంధనలను న్యూజిలాండ్ సరళతరం చేసింది. వీసా దరఖాస్తుదారులకు ఉండవలసిన వర్క్ ఎక్స్‌పీరియెన్స్‌ను మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించింది. అనుభవజ్ఞులైన సీజనల్ వర్కర్స్ కోసం మూడేళ్ల మల్టీ ఎంట్రీ వీసాను, తక్కువ నైపుణ్యంగల కార్మికుల కోసం ఏడు నెలల సింగిల్ ఎంట్రీ వీసాను జారీ చేయాలని నిర్ణయించింది. సీజనల్ లేబర్ డిమాండ్‌ను అధిగమించడం కోసం ఈ చర్యలను చేపట్టింది. వర్కర్లకు వేతనాలు చెల్లించే విషయంలో యజమానులపై ఉన్న నిబంధనలను కూడా సరళతరం చేసింది. దీంతో వేతనాల విషయంలో యాజమాన్యాలకు స్వేచ్ఛ లభిస్తుంది. లెవెల్ 4 లేదా 5 ఉద్యోగాల కోసం స్థానికులను నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా యాజమాన్యాలు చెప్పుకోవడానికి గతంలో ఉన్న కఠినమైన నిబంధనలను న్యూజిలాండ్ ప్రభుత్వం తొలగించింది.

కేజ్రీవాల్ నివాసానికి 3 రెట్లు అధిక వ్యయం!

కాగ్ నివేదిక?

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అరవింద్ కేజ్రీవాల్ తన అధికార నివాసం మరమ్మతుల కోసం అంచనా కంటే మూడు రెట్లు అధిక వ్యయం చేసినట్టు కాగ్ తన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ నంబర్ 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని అధికారిక బంగళాలో నివసించినపుడు దాని మరమ్మతుల కోసం ప్రాథమిక అంచనా వ్యయం రూ. 7.91 కోట్లుగా నిర్ణయించగా 2020లో రూ.8.62 కోట్లకు కాంట్రాక్టు ఇచ్చారు. 2022లో పీడబ్ల్యూడి శాఖ పనులు పూర్తి చేసే నాటికి మూడు రెట్లు పెరిగి మొత్తం ఖర్చు రూ.33.66 కోట్లకు చేరుకుంది. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ అంశంపై బీజేపీ, ఆప్ మధ్య మాటలయుద్ధం నడుస్తున్నది.

రన్‌వేపై కూలిన కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్

ముగ్గురు సిబ్బంది దుర్మరణం

పోర్‌బందర్: భారత తీర రక్షక దళ(ఐసీజీ) హెలికాప్టర్ ఆదివారం రన్‌వేపై దిగుతున్నప్పుడు కుప్పకూలి ఆహుతైంది. ఈ ఘటనలో అందులోని ముగ్గురు సిబ్బంది దుర్మరణం చెందారని పోలీసులు తెలిపారు. పోర్‌బందర్ ఎస్పీ కథనం ప్రకారం... అధునాతన తేలికపాటి హెలికాప్టర్(ఏఎల్‌హెచ్) గుజరాత్‌లోని పోర్‌బందర్ తీర రక్షక విమానాశ్రయం రన్‌వేపై దిగాలని వస్తుండగా రన్ వే సమీపంలో కూలిపోయింది. వెంటనే హెలికాప్టర్‌లో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది తక్షణం స్పందించి మంటలను అదుపు చేసి అందులోని ముగ్గురు సిబ్బందిని దవాఖానకు తరలించారు. 'దవాఖానకు చేరగానే ఇద్దరు మరణించారు. మరొకరు చికిత్స పొందుతూ చనిపోయారు' అని కమలా బాగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లండన్‌లో మనోళ్ల పాగా!

- బ్రిటన్ పౌరుల కంటే అధిక ఆస్తులు సొంతం
- తాజా నివేదికలో వెల్లడి

లండన్: ఒకప్పటి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు రాజధాని లండన్‌లో భారతీయులు పాగా వేశారు. లండన్‌లో అత్యధిక భాగం మనోళ్ల చేతుల్లోనే ఉన్నది. అవును, ఇది నిజమే. ఇప్పుడు లండన్‌లో ఎక్కువ ఆస్తి పాస్తులు కలిగి ఉన్నది భారతీయులే. ఇతర దేశాలవారినే కాదు, స్థానికులైన బ్రిటిషర్లను మించి మనవాళ్లు అక్కడ ఆస్తులను కలిగి ఉన్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార రీత్యా బ్రిటన్‌కు వెళ్లిన భారతీయులు లండన్‌లో ఎక్కువ ఆస్తులను కలిగి ఉన్నట్టు 'బ్యారెట్ లండన్' విడుదల చేసిన 'ది రైజ్ ఆఫ్ ప్రాపర్టీ పవర్ ఇన్ లండన్' నివేదిక వెల్లడించింది. ఇది తాత్కాలిక ధోరణి మాత్రమే కాదని, లండన్ ప్రాపర్టీ మార్కెట్‌లో కనిపిస్తున్న గణనీయమైన మార్పు అని ఆ నివేదిక స్పష్టం చేసింది.

సోషల్ మీడియాలో వైరల్

'బ్రిక్స్ ఇన్సా' అనే యూజర్ ఈ విషయాన్ని ఎక్స్ ఖాతాలో పోస్టు చేయగా వెంటనే వైరల్‌గా మారింది. లక్షల మంది దీన్ని వీక్షించారు. బ్రిటిష్ వలస పాలనలో మన దేశం ఎక్కువ కాలం ఉండటంతో భారతీయులు దీనిపై తమదైన శైలిలో కామెంట్లు చేశారు. బండ్లు ఓడలు అవడం, ఓడలు బండ్లు అవడం అంటే ఇదేనని కొందరు చమత్కరించారు. 'ఒకప్పుడు సగం ప్రపంచం వారి చేతుల్లో ఉండేది. కానీ, ఇప్పుడు లండన్‌లో సగం కంటే తక్కువ మాత్రమే వారి వద్ద ఉంది' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. 'భారత ఉపఖండాన్ని ఆక్రమించిన బ్రిటిషర్ల వలె కాకుండా భారతీయులు చట్టపరంగా చేశారు' అని ఒకరు పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా 'ఇంగ్లండ్‌ను వలస రాజ్యం చేయాలి, దానికి న్యూ ఇండియా అనే పేరు పెట్టాలి' అని కొందరు కామెంట్ చేశారు.

రేప్ నిందితుడితో బాధితురాలికి పోలీసుల పెండ్లి

యూపీలో షాకింగ్ ఘటన

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో 19 ఏండ్ల యువతి లైంగికదాడికి గురికాగా.. న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయిస్తే నిందితుడితో బాధితురాలికి పెండ్లి జరిపించి చేతులు దులుపుకున్నారు. అయితే నిందితుడికి అంతకుముందే మరో మహిళతో వివాహం అయిన సంగతి ఆలస్యంగా వెలుగుచూడటంతో బాధితురాలు, ఆమె కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడు సాజిద్ అలీపై పోలీసులు సెక్షన్ 376(లైంగికదాడి) కింద కేసు నమోదుచేశారు. హమీర్‌పుర్ జిల్లా కోత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధిత మహిళ గత ఏడాది నవంబర్ 26న ఓ బిడ్డకు జన్మనిచ్చింది.సాజిద్ అలీపై జనవరి 3న బాధితురాలు ఫిర్యాదు చేసింది.

రష్యాకు ఉక్రెయిన్ షాక్!

- కుర్స్క్‌లో ఆకస్మిక ఆపరేషన్
- అణు విద్యుత్తు ప్లాంట్ స్వాధీనం!

మాస్కో, జనవరి 5: రష్యాతో జరుగుతున్న భీకర యుద్ధంలో ఉక్రెయిన్ బలగాలు మెల్లగా పుంజుకుంటున్నాయి. రష్యా ఆధీనంలోని 'కుర్స్క్' ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లోకి ప్రవేశించిన ఉక్రెయిన్ బలగాలు, ఇక్కడ చేపట్టిన మిలటరీ ఆపరేషన్ సక్సెస్ అయినట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. కుర్స్క్ అణు విద్యుత్ ప్లాంట్‌ను ఉక్రెయిన్ బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలిపాయి. దక్షిణ కుర్స్క్ ప్రాంతంలో రెండు రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో తమ సైనికులు భారీగా విరుచుకుపడటంతో అక్కడి బలగాలకు భారీ ప్రాణ నష్టం వాటిల్లిందని జెలెన్‌స్కీ చెప్పారు. 'గత రెండు రోజులుగా కుర్స్క్ ప్రాంతంలోని మఖ్నోవ్కా గ్రామ సమీపంలో జరుగుతున్న యుద్ధంలో మా బలగాలు పైచేయి సాధిస్తున్నాయి. ఇది యుద్ధంలో మాకు మరో ముఖ్యమైన ముందడుగు' అని జెలెన్‌స్కీ అన్నారు. దీంతో ఉక్రెయిన్ బలగాలు రష్యాలోకి మరింత ముందుకు వెళ్లేందుకు మార్గం సుగమమైందని అన్నారు. ఇది ఒక విధంగా రష్యా మిలటరీకి షాక్ లాంటిదేనని ఉక్రెయిన్ అధికారులు, రష్యన్ బ్లాగర్స్ చెబుతున్నారు. దక్షిణ కుర్స్క్‌లోని బోల్షోసోల్దాట్స్కో అనే గ్రామంలో ముందుకు వెళ్తున్న ఉక్రెయిన్ మిలటరీ వీడియో ఫుటేజీలు బయటకు వచ్చాయి. కుర్స్క్ ప్రాంతంలో చేపట్టిన మిలటరీ ఆపరేషన్ సక్సెస్ అయినట్టు జెలెన్‌స్కీ కార్యాలయం హెడ్ ఆండ్రియా యెర్మాక్ మీడియాకు తెలిపారు. ప్రధానంగా కుర్స్క్ ప్రాంతంలో గత ఆరు నెలలుగా ఉక్రెయిన్ భీకర పోరు సాగిస్తున్నది. రష్యా ఆధీనంలోకి వెళ్లిన తర్వాత.. తిరిగి 40శాతం భూభాగాన్ని ఉక్రెయిన్ మిలటరీ స్వాధీనం చేసుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి.

సింధు లోయ నాగరికత లిపిని అనువదిస్తే 85 లక్షలు

తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై: సింధు లోయ నాగరికత లిపి శతాబ్ద కాలానికి పైగా అంతుచిక్కని చిక్కుముడిగానే మిగిలిపోయిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఆ లిపిని అనువదించిన వారికి రూ. 85 లక్షల(10 లక్షల డాలర్లు) బహుమానాన్ని అందచేస్తానని ఆయన ప్రకటించారు. సింధు లోయ నాగరికతను కనుగొని వందేళ్లు గడచిన సందర్భంగా ఆదివారం మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఒకప్పుడు గొప్ప నాగరికతగా విరాజిల్లిన సింధు లోయ నాగరికతకు సంబంధించిన లిపిని ఇప్పటికీ అర్థం చేసుకోవడం మనకు సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నా చావుకు కారణమైన భార్యకు గుణపాఠం చెప్పండి

వీడియో చేసి భర్త ఆత్మహత్య

అహ్మదాబాద్: భార్య మానసికంగా పెడుతున్న హింసను తాళలేక గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణమైన తన భార్యకు గుణపాఠం చెప్పాలంటూ కుటుంబ సభ్యులను కోరుతూ వీడియో చేశాడు. ఈ మేరకు మృతుడి తండ్రి బొటాడ్ జిల్లా పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో వారు మృతుడి భార్యపై కేసు నమోదు చేశారు. జామర్ధ వల్లగే నివాసి సురేష్ భాయ్ సాథ్లియా తన సమీప గ్రామానికి చెందిన జయను వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లయినప్పటి నుంచి భార్య అతనితో గొడవ పెట్టుకుంటూ తరచూ పుట్టింటికి వెళ్లిపోయేది. ఇటీవల అదే తరహాలో పుట్టింటికి వెళ్లిన జయ ఇక తాను అత్తింటికి వచ్చేది లేదంటూ తెగేసి చెప్పింది. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు.

ఒంటరితనంతో ఇన్ఫెక్షన్ల ముప్పు!

న్యూఢిల్లీ: స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసుండటం మానసిక ఆరోగ్యాన్ని చక్కగా ఉంచడంతో పాటు గుండె జబ్బులు, గుండెపోటు, టైప్ 2 డయాబెటిస్, ఇన్ఫెక్షన్ల లాంటి వ్యాధులు రాకుండా నిరోధించే అవకాశం ఉందని తాజా అధ్యయనం తేల్చింది. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, పుడాన్ యూనివర్సిటీ యూకే బయో బ్యాంక్‌లోని 42 వేల మంది డాటాను విశ్లేషించిన తర్వాత ఈ వివరాలను వెల్లడించింది. నలుగురితో కలవకపోవడం, ఒంటరిగా ఉండటం వల్ల రక్తంలో ఉండే నిర్దిష్ట ప్రొటీన్లు ఇన్ఫ్లమేషన్(నొప్పి, మంట), రోగనిరోధక శక్తి ప్రతిస్పందన, ఒత్తిడి నియంత్రణ వంటి తీవ్ర అనారోగ్య పరిస్థితులను పెంపొందిస్తాయని వారు కనుగొన్నారు. ఆక్సిటోసిన్ లాంటి హార్మోన్లను ఏడీఎమ్ అనే కీలక ప్రోటీన్ నియంత్రిస్తున్నదని పరిశోధకులు గుర్తించారు. భావోద్వేగాలు, సామాజిక సంబంధాల ప్రాసెసింగ్‌కు బాధ్యత వహించే ఈ ప్రోటీన్ స్థాయిలు ఎక్కువైతే మరణ ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు.

కృష్ణజింకను చంపిన చిరుత.. షాక్‌తో మరో ఏడు మృతి

పటేల్ విగ్రహం సమీపంలో ఘటన

గాంధీనగర్: గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ సమీపంలోని జంగిల్ సఫారీ పార్కులోకి చొరబడిన చిరుత ఓ కృష్ణ జింకను చంపగా దీన్ని చూసి భయంతో షాక్‌కు గురైన మరో ఏడు కృష్ణ జింకలు కూడా మరణించాయి. జనవరి 1వ తేదీ తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనపై గుజరాత్ అటవీ శాఖ దర్యాప్తు ప్రారంభించింది. కేవడియా అటవీ డివిజన్ పరిధిలోని పార్కులోకి పటిష్టమైన కంచెను తప్పించుకుని ఓ 2 లేక 3 సంవత్సరాల వయసున్న చిరుత చొరబడింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహమున్న ప్రదేశానికి సమీపంలో ఈ పార్కు ఉంది. చిరుత పులులు అధికంగా ఉన్న శూల్పనేశ్వర్ అభయారణ్యం దీనికి అత్